సుందరమ్మ అల్లుడు

శర్మ భార్యను రైలు ఎక్కించి ప్లాట్‌ఫారం మీద నుంచుని ఉన్నాడు.

ఆ అమ్మాయి అన్నది "తమ్ముడి అన్నప్రాశన రేపు అయిపోతుంది. నేను అక్కడ అట్టే రోజులు ఉండవలసిన అవసరం ఉండదు. మీరు శనివారం రండి. కలసి మళ్లీ వచ్చేద్దాము.

శర్మ తలఊపి "నేను రావటానికి వీలుండదు. పరీక్షలు దగ్గరకు వచ్చినవి, చదువుకోవాలి" అని కచ్చితంగా చెప్పేశాడు.

ఇట్లా అన్నాడూ అంటే దానికి తగినంత కారణం లేకపోలేదు. ఆ అమ్మాయి శర్మను చాలా విసిగించింది.

క్రొత్తగా కాపరానికి వచ్చిన పిల్లనుగదా అని ఆ అమ్మాయి మొగుడుదగ్గర భయభక్తులతో ఉండటం కాని సిగ్గుగా ఉండడం కాని లేదు. దానికి కారణం ఇంట్లో పెద్ద వాళ్ళు ఎవ్వరూ లేక పోవటమే. అత్తగారు ఉన్నది కాని, ఆవిడ సాధారణంగా ఏ విషయమూ పట్టించుకోదు.

ఆ అబ్బాయి చదువుకొంటూ ఉంటే ఆ అమ్మాయి ఏదో పెద్దపని ఉన్నదానిలాగా వచ్చి, దేనికోసమో అక్కడా ఇక్కడా వెదికి చటుక్కున దీపం ఆర్పేసి "ఇహపడుకోండి పది అయింది. అట్టే చదవటం వలన ఏమీ ప్రయోజనం లేదు. ఆరోగ్యం చెడిపోవటం తప్ప!" అని విరగబడి నవ్వి పక్కమీద తెల్లదుప్పటి లాగి విదిలించి వేసేది.

దాని తరువాత మళ్ళీ దీపం వెలిగించి చాలా ప్రయత్నం చేసినా కూడా అతని చదువు సాగేదికాదు.

బావమరది వచ్చి వాళ్ళ అక్కయ్యను తీసికొని వెడతానన్నప్పుడు శర్మ అనుకొన్నాడు. "ఇది ఒకందుకు మంచిదే. దీన్ని పంపించి నేను నాలుగురోజులు హాయిగా చదువుకోవచ్చు.

అందుకనే ఆ అమ్మాయి "మీరు రెండు రోజులలో రండి ఇద్దరం కలసి వద్దాము" అని అంటే తల గిరగిరా త్రిప్పి 'రాను' అని గట్టిగా చెప్పాడు.

ఆ అమ్మాయి వెళ్ళిపోయిన నాటి రాత్రే శర్మకు కొంచెము కూడా నిద్రపట్టలేదు. పక్కమీద ఉన్న మాసిన దుప్పటిని చూచినప్పుడే ఆ అబ్బాయి ఆలోచనలో పడ్డాడు, దుప్పటితీసి కొత్తదుప్పటి వేయటం ఎల్లాగా అని! కొత్త దుప్పటి ఎక్కడ ఉందో అతనికి ఏం తెలుస్తుంది! తెలుసుకోవటానికి ప్రయత్నం చేసికూడా లాభం ఉండదని అతనికి తెలుసు. అందుకనే అతడు అల్లాంటి ప్రయత్నం ఏమీ చెయ్యక ఆ మాసిన పక్కపైనే పడుకొని నిద్ర పట్టక చాలా అవస్థల పాలైనాడు.

తెల్లవారిన తరువాత అతనికి ఎన్నో విషయాలు చికాకు కలిగించినవి. అన్నానికి రమ్మని ఎవ్వరూ పిలవలేదు. తానే వెళ్ళి తల్లినడిగి పెట్టించుకొని తిన్నాడు.

ఆ రోజు కఫ్సుగుండీలు పెట్టుకోకుండానే కాలేజీకి వెళ్ళాడు. అవి వేలాడుతూ ఉన్నవి. పైకి మడత వేసినా

నిలువక క్రిందికి జారిపోయినవి. శర్మ ఆ రోజల్లాకూడా చాలా చికాకుగా ఉన్నాడు.

శర్మ సాయంత్రానికి ఇంటికి వచ్చి తల్లిని పిలిచి అడిగాడు. "పుస్తకాలు అన్నీ దుమ్ముకొట్టుకొన్నాయి. నా కలం కూడా కనపడలేదు. ఎట్లాగమ్మా?" "ఇవన్నీ ఎవరికి తెలుస్తయి నాయనా! కోడలుంటే అది చూస్తుండేది" అని ఆమె నవ్వుకొన్నది.

ఇంటికైన కోడలు లేకపోతే ఎంతకష్టమో అందరికీ తెలిసివచ్చింది. ఒక్కరోజు ఆ అమ్మాయి వెళ్ళిన మరునాటి కల్లా చిన్నచిన్న ఉపద్రవాలు చాలా బయలుదేరినవి. తల్లి పెందలాడే మడికట్టుకొని పూజచేసికొంటూ ఉండటంమూలాన, శర్మ తానే స్వయంగా కాఫీ కాచుకోవలసివచ్చింది. అప్పుడు చెయ్యికూడా కాలింది. అంతేకాకుండా చెయ్యి జారిపడి పోయి టీ కప్పుకూడా పగిలిపోయినది. భోజనము అయిన తరువాత భార్యే చేతిమీద నీళ్ళు పొయ్యాలె. శర్మకు ఆరోజున నీళ్ళు పోసేవాళ్ళు ఎవ్వరూ లేకపోయినారు.

శర్మకు తాంబూలం ఇచ్చేవాళ్ళు ఎవరున్నారు! అతడే పాపం, ఆకులకు సున్నం రాచుకొని వేసుకోవలసి వచ్చింది. ఈ విషయంలో మాత్రం శర్మ చాలా కష్టపడ్డాడు

ఆ సాయంత్రమే చాకలిది బట్టలు తెచ్చింది. లెక్క చూడటం ఎవ్వరికీ తెలియలేదు. తెచ్చిన బట్టలు అక్కడ పెట్టిపోయింది అది! అది ఎన్నిచ్చిందో ఏమో! సగం బట్టలు పారేసినా కనుక్కొనే దిక్కు లేదు.

పుస్తకాలన్నీ దుమ్ముకొట్టుకొన్నవి. వాటి ముఖం చూచేవారు లేరు. దువ్వెనా అద్దమూ మొదలైనవి అన్నీ ఇంటావిడ లేదుగదా, మనతో ఎవరికి పని ఉంటుంది అని అను కొన్నవో ఏమో ఎక్కడి వక్కడ కనపడకుండా పోయినవి.

ఎంత విచిత్రమైన విషయము! ఆవిడ ఉన్నప్పుడు ఎక్కడివి అక్కడ వినయ విధేయతలతో పడి ఉండేవి! ఇప్పుడు అన్నీ అల్లరి చిల్లరగా తిరుగు తున్నవి కాబోలు!

సాయంత్రము అయింది. శర్మ భోజనముచేసి చదువు ప్రారంభించాడు. గంటసేపు అయిన తరువాత చూచుకొంటే ఆరుపంక్తుల ఇతవల ఉన్నాడు. ఎందుచేతనబ్బా చదువు సాగటం లేదు!

శర్మకు ఏమీతోచ లేదు. ఆరోజుకు చదువు మానేసి పడుకొని దీనికంతా కారణం ఏమిటో ఆలోచించాలని నిశ్చ యించు కొన్నాడు. గాలిదేవుడు దక్షిణానైపు కిటికీతలు పులను మెల్లగా నెట్టి, తొంగిచూచి, ఆవిడ లేకపోయేటప్పటికి మహాజోరుగా వచ్చేశాడు. వచ్చి పక్క అంతా చిందరవందర చేశాడు. శర్మకు చాలా చిన్నతినం అయింది. ఛా ఇదేమీ బాగుండ లేదు అనుకొన్నాడు.

అది వెన్నెలరాత్రి కాదు. లోపలా బైటా అంతా చీకటిగాఉంది. శర్మ అటూ ఇటూ చూచి ఇల్లా అనుకొన్నాడు. "ఆవిడఉంటే ఇల్లా ఉండేదికాదు."

ఆరాత్రి నక్షత్రాలు ప్రకాశిస్తున్నాయి. మిథునరాశిలో పెళ్ళాం నక్షత్రం భర్తవేపు చూచి అన్నది. "ఆ కిటికీలో నుంచి చూస్తున్నారా? ఆపిల్లవాడు పక్కమీద పడి, ఎల్లాగ

వొస్తుతున్నాడో చూడండి నిద్రపట్టక!!" ఇద్దరూ ఒకరికి దగ్గరగా ఒకరుజరిగి నవ్వుకున్నారు.

ఆ రోజు రాత్రి శర్మ చాలాసేపు చాలా తీవ్రంగా ఆలోచించాడు. ఆవిడ లేకపోతే బాగా చదువుసాగాలుండి. అసలే సాగటంలేదు. ఆవిడ ఉన్నప్పుడే కాస్తనయం! దీని కంతా కారణం ఏమిటి?

ఎంతసేపు ఆలోచించినా ఈ విపరీత పరిస్థితికి కారణం ఏమిటో అతనికి బోధపడలేదు. ఒకటి మాత్రం నిజం. ఆ అమ్మాయి వస్తే చదువు సాగేటట్టుగా ఉంది.

మరునాడు సెలవుదినమే! వెళ్ళినా వెళ్ళవచ్చు. తెల్లవారుఝామున బండికి వెళ్ళి సాయంత్రానికల్లా ఇంటావిడను తీసుకొని రావచ్చు. కాని యిరవై ఏండ్ల కుఱ్ఱవాడు ఆపని చేయటానికి వెంటనే సాహసించలేక పోయినాడు.

అయినా తనంతటతానే వెళ్ళి నా పెళ్ళాన్ని పంపమని అడుగుతాడా! ఛా, ఛా, శర్మ ఆపని ఎప్పుడూ చెయ్యలేడు, అతనికి తగని సిగ్గు.

అయినా ఎవరిని అడగాలి! పెళ్ళాన్ని పంపమని! అత్తగారిని అడగాలో మామగారిని అడగాలో అతనికి తెలియలేదు. ఈ విషయముపై సమగ్రంగా తెలుసుకోంటానికి ఎవరినైనా అడగటానికి అతనికి సిగ్గు ఇటువంటి విషయాలను గురించి తెలిపే పుస్తకాలు ఏమైనా వున్నవో లేవో అతనికి తెలియదు.

శర్మ బి ఏ ప్యాసు అయినాడు తెలుగులోనూ, సంస్కృతంలోనూ. బాగా చదువుకొన్నవాడే కాని ఇటువంటి విషయాలను గురించి చెప్పే పుస్తకాలు అతను చూడలేదు.

తనంతటతాను అత్తవారింటికి పెళ్ళాన్ని పంపించమని అడగటం లోకువ కావటం కాదా అని ఆలోచించాడు.

ఆలోచించి, చివరకు 'ఎబ్బే ఎట్లా వెళ్ళేది ఛా వెళ్ళకూడదు' అని అనుకున్నాడు.

ఇంకా ఏమనుకున్నాడూ అంటే 'ఈవిడ రాకపోతే నాకు జరగదా. వండిపెట్టటానికి మా అమ్మ ఉంది. దాసీది నీళ్ళు కాచి ఇస్తుంది. పక్క నేను దులిపివేసుకోలేనా? ఆమె ఇష్టంవచ్చినన్నిరోజులు పుట్టింట్లో ఉన్నా నాకేమీ భయం లేదు, నేను వెళ్ళను!'

ఈ నిశ్చయం చాలాసేపు నిలువలేదు. దానికి కారణం మనం ఊహించనూ లేము. కాని మొత్తంమీద శర్మ అటూ ఇటూ చాలాసేపు ఊగాడు.

ఆపిల్ల వెళ్ళి రెండురోజులుకాలేదు. ఇంతలో మునిగిపోయినట్లు తాను పరుగెత్తుకుపోతే అంతా నవ్వరూ!

కాని అంతా నవ్వుతారని ఊరుకొంటే బొత్తిగా చదువు సాగటం లేదే! అది ఎట్లు?

ఇల్లాగ చాలాసేపు ఊగిఊగి చివరకు అనుకొన్నాడు 'తెల్లవారుఝామున బండికి వెళ్ళి ఆ పిల్లను తీసుకొని వస్తేనే మంచిది' అని!

ఈ నిశ్చయానికి రావటంలో అతడు తొందరపడ్డాడని గాని సిగ్గులేకుండా తెగబడ్డాడనిగాని అంటానికి ఏ మాత్రమూ

వీలులేదు. సిగ్గుపడి వెళ్ళకపోతే పరీక్షలు తప్పిపోవలసిందే కదా! అది మటుకు ఏమంత మంచిపని! అందుకని శర్మ వెళ్ళటానికి నిశ్చయించుకున్నాడు.

శర్మ తెల్లవారు జామున నాలుగుగంటలకే లేచి ముఖం కడుక్కొని మంచిబట్టలు వేసుకొని బయలుదేర బోతూ తల్లిని లేపి అడిగాడు "అమ్మా వెళ్ళి దాన్ని తీసుకు రానా?"

తల్లి లేచివచ్చి "వెళ్ళిరా నాయనా! వెళ్ళకపోతే ఎట్లా! ఆవిడ అక్కడ కూర్చుంటే ఇక్కడ ఎట్లా జరుగు తుందీ?" అన్నది.

శర్మ మెల్లగా లేచి కొత్తకోటు తొడుక్కొని జరీ ఉత్తరీయం వేసుకొన్నాడు. ఈ వెళ్ళటం ఏమంతబాగుంది, పోనీ మానివేశేదామా అనుకొన్నాడు.

అల్లా అనుకొని ఉండనూ లేడు; తెగించి వెళ్ళనూ లేడు. శర్మ ఈ ఆలోచనలో పడ్డ బాధ ఆ భగవంతుడికే తెలియాలె.

ఇల్లాగ మథన పడుతూ ఉండగానే ఒక పెద్ద తమాషా జరిగింది. ఏమిటా అంటే ఎవరో పెద్దకేకవేసినట్టు అతని మనస్సుకు ఈ మాటలు వినపడ్డవి? "ఏమిటా ఊగులాట; వెళ్ళకపోతే ఎట్లా? ఆ అమ్మాయి వెంటనే రాకపోతే నీసంగతి ఎట్లాగు ఉన్నా ముందు మీ అమ్మకు జరగదు. ఆవిడ అన లేదూ, కోడలు అక్కడుంటే ఇక్కడ ఎట్లా జరుగుతుందిరా నాయనా అని!

ఈ మాటలు విన్నట్టు అమ్మోసరికి అతని కళ్ళల్లోకి కొత్త కాంతులు వచ్చినవి. అతడు కుర్చీలో కూర్చొని ఆలోచిస్తున్నాడు.

పనిగంట కల్లా అక్కడికి చేరుతాడు. భోజనాలైన తరువాత 'దాన్ని తీసుకొని వెడతాను' అని అంటాడు. అంటే ..అప్పుడు వాళ్లేమంటారు, 'అప్పుడే ఏం తీసికొని వెళ్ళటం నాయనా, వచ్చి రెండురోజు లేకదా అయింది. ఇంకా నాలుగు రోజులు ఉంచుకొని పంపిస్తాములే' అంటారు.

అల్లా అంటే అప్పుడు తనేమి అనాలి?

ఏముందోయ్ మీ అమ్మాయి మీయింట్లో ఎన్ని రోజు లున్నా నాకేమీ అభ్యంతరం లేదు. అయితే మా అమ్మ పెద్దది. ఆవిడ అన్నది 'కోడలు అక్కడ ఉంటే ఇక్కడ ఎట్లా జరుగుతుందిరా!' అని. అందుకనే వచ్చాను. లేకపోతే నాకేం!

ఇల్లాగ అనాలని అనుకొంటున్నాడు. ఇంతలో తల్లి వచ్చి, "ఏంరా ఇక్కడే కూర్చున్నావు. ఇంకా రైలుటైము కావటం లేదూ" అన్నది.

శర్మ అన్నాడు, "చదువు పోతుందని ఆలోచిస్తున్నానమ్మా" అని.

ఆ మాటమీద ఆవిడ అన్నది. "ఒక్క పూటలో చదువు ఏమంత పోతుంది. వెళ్ళిరా నాయనా, కోడలు అక్కడుంటే నాకేమీ తోచటం లేదు. అయినా ఎట్లాజరుగుతుంది. వెళ్ళిరా నాయనా."

శర్మ మనస్సు చివుక్కుమన్నది. తను వెళ్ళకపోతే ఆమెగారి మనస్సు కష్టపడుతుంది. ఆ అమ్మాయిని తీసుకొని

రాకపోతే తల్లికి ఒక్కనిమిషం గడవదు. శర్మ తక్షణం లేచి ఉత్తరీయం పైనవేసుకొని వీధిలో కాలుపెట్టాడు. ఇప్పుడు శర్మ తనకోసంకాదు వెళ్ళుతూఉన్నది, తల్లికోసం. ఆ పిల్ల లేకపోతే తల్లికి జరగదు. అందుకనే వెడుతున్నాడు. ఇప్పుడు అతనికి తగినంతకారణం దొరికింది అత్తవారింటికి వెళ్ళటానికి.

అత్తగారింట్లో అందరూ తననుజూచి నవ్వుతారు. పెళ్ళాంకోసం పరుగెత్తుకు వచ్చాడని అనుకొంటారు. కాని ఏంజేస్తాడు! తల్లిమనస్సు కష్టపెట్టడం ఏమంత మంచిపని కాదు. ఇల్లాగ కాసేపు ఆలోచించాడు. చివరకు ఒక నిశ్చయానికి రాగలిగినాడు.

ఎవ్వరేమనుకొన్నా సరే, తల్లిమాట వినాలి!!

అందుకనే అతడు గబగబా గబగబా నడిచి స్టేషనుకు వెళ్ళిపోయినాడు.

శర్మ రైలుదిగి ఎక్కడా ఆగకుండా యకాయకీని అత్తవారింటికే వెళ్లాడు. మధ్య ఎక్కడైనా ముఖం కడుక్కొని కాఫీతాగి మరీ వెడదామా అని అనుకున్నాడు గాని అల్లాగ చేయలేదు ఎందుకో మరి!

ఇంటిముందు బండి ఆగటంతోనే శర్మ మరదలువచ్చి ఇతణ్ణిచూచి పరుగెత్తుకుంటూ లోపలికివెళ్ళి చెప్పేసింది వాళ్ళమ్మతో "అమ్మోయ్ బావ వచ్చాడే" అని. అత్తా మామా వచ్చి శర్మను క్షేమ సమాచారాలు అడిగారు.

అంతా బాగానేఉంది. కాని శర్మ అసలు ఎవరిని చూద్దామని వచ్చాడో ఆమెమాత్రం కనపడలేదు. మేడపైనే ఉందో, క్రిందే ఉన్నదో శర్మ ఊహించలేక పోయినాడు.

"అల్లుడు కాఫీ పుచ్చుకున్నట్లు లేదే, కనుక్కో" అని ముసలాయన భార్యతో అన్నాడు.

శకుంతల శర్మను అడిగింది "ఏం బావా, అసలు ముఖమైనా కడుక్కున్నావా?"

శర్మ లేదని తలతిప్పాడు. బావ విషయమై చూడవలసిన బాధ్యత అంతా ఆ పిల్లపై పడ్డది. ముఖం కడుక్కునేందుకు నీళ్ళు అవీ తెచ్చియిచ్చింది. శర్మ కాఫీతాగుతూ అటూ ఇటూ పిచ్చిచూపులు చూశాడు. కాని కనపడవలసిన వాళ్లు కనపడలేదు.

శర్మకేమీా తోచలేదు. పక్క వీధిలోవున్న హోటలుకు వెళ్ళి ఇడ్డెనలు తినాలని శర్మకు బుద్ధిపుట్టింది. అతనికి ప్రొద్దున్నే రెండు ఇడ్డెనలు తినే అలవాటు ఉన్నమాటకూడా నిజమే.

అతడు పైన ఉత్తరీయం వేసుకొని బైటకు వెళ్ళటానికి తయారు కావటం చూచి ఆ పిల్ల పరుగెత్తుకెళ్లి చెప్పింది వాళ్ళమ్మతో 'బావ ఎక్కడికో వెళ్ళుతున్నా'డని. ఆమె అడిగింది 'ఎక్కడికి నాయనా' అని.

ఇడ్డెనలు తినివస్తానని చెప్పటానికి శర్మకు సిగ్గు వేసింది. అందుకని "ఇప్పుడే వస్తాను. ఇక్కడికే, ఒక స్నేహితుడింటికి వెళ్లివస్తాను" అన్నాడు.

"ఇప్పుడేం వెళ్ళటం నాయనా. అన్నంతిని వెడితే నయంకాదూ?" అన్నది ఆవిడ.

శర్మ తలొంచుకొని. "ఇప్పుడే వస్తానండి"అని అంటూ వెళ్ళాడు.

ఆ అబ్బాయి ఇప్పుడు వెళ్ళటం నిజంగా అనవసరం. మామగారు పదిగంటలకల్లా అన్నంతిని ఆఫీసుకు వెడతాడాయె. మామగారితో తను భోజనం చెయ్యాలిసిఉండె! అప్పటికే తొమ్మిది కావస్తున్నది. ఇప్పుడు ఇడ్డెనలు తినక పోతేనేం?

కాని అతనికి ఇడ్డెనలు తినకపోతే మనస్సు సరిగ్గా ఉండదు. ఇడ్డెనలు తినలేదన్న దిగులుతో అతనికి అన్నం కూడా సహించకపోనే పోవచ్చుకూడా! అందుకనే అత్తగారు వద్దు అంటున్నా వినక గబగబా కాఫీ హోటలుకు వెళ్ళి పోయినాడు.

సుందరమ్మగారు భర్త దేవతార్చన చేస్తూ ఉన్న దగ్గరకు వెళ్ళి తలుపుపక్కగా నుంచుని అన్నది "తొందరగా కానీయండి. ఇవ్వాళకూడా ఆలస్యం చేస్తే ఎట్లా?"

ఆయన మంచి ధ్యాస్యంలో ఉండి మాట్లాడలేదు. కాని పదినిమిషాలలో భార్యకు తీర్థం ఇచ్చి "ఇక నా ఆలస్యం లేదు" అన్నాడు.

ఈ లోపున సుందరమ్మగారు నాలుగుసార్లు దొడ్డి గుమ్మంలో నుంచుని చూచింది అల్లుడొస్తున్నాడేమోనని.

శర్మ అయినా ఆలస్యం చేయలేదు నాలుగు ఇడ్డెనలు తిని, మళ్ళీ ఇంకోసారి కాఫీతాగి గబగబా వచ్చేశాడు. తన హృదయేశ్వరి కనుపించలేదుగా, ఆవిడను చూద్దామని ఆదుర్దా ఎక్కువగా ఉంది.

అల్లుడు రావటంలోనే అతణ్ణి స్నానం చెయ్యమని బలవంతపెట్టింది అత్తగారు. 'ఇప్పుడు అన్నం తినండీ, ఇంకా

కాసేపు ఉండి తింటాను' అనటానికి శర్మకు సిగ్గువేసింది. ఆమాట అనలేకపోయినాడు. మెదలకుండా స్నానంచేసి భోజనానికి తయారైనాడు.

సుందరమ్మగారు అల్లుడికీ, భర్తకూ వడ్డించింది. శర్మ ఇడ్డెనలు తిని పదినిమిషాలైనా కాలేదు. గొంతులో ఇడ్డెనలు గొంతులోనే ఉండె! పాపం ఏమి తినగలడు!

ఏమీ తినలేకపోయినాడు. రాత్రంతా నిద్రలేకపోవటం మూలాన శర్మ తూలుతూ ఉన్నాడు. బడలికగా నీరసంగా ఉన్నాడు. అందుకని ముఖం చిట్లించి అటునెట్టి ఇటునెట్టి ఒక్క ఆధరవుతోనూ, ఇంత అన్నం తిక లేక పోయినాడు.

శర్మ అత్తగారికి ఎంతో కష్టం వేసింది. అతడు ఎందుకు తినటంలేదో ఆవిడకు తెలియదాయె. అందుకని "ఏం నాయినా అన్నం సహించటం లేదేమి బాబు!" అని అడిగింది.

అత్తగారు అడిగిన ప్రశ్నకు ఇతడేమీ సమాధానం చెప్పలేదు. ఆడవాళ్ళతో మాట్లాడటానికే సిగ్గు అతనికి!

అదీ కాక....

ఏమని చెబుతాడు! కాఫీ హోటలు కెళ్ళి ఇడ్డెనలుతిని వచ్చానని చెబుతాడా! ఒకవేళ అల్లాగ నిజం చెబుదామన్నా వీలులేకొచ్చె? అసలు అతను కాఫీహోటలుకు కాదుగా వెళ్ళింది. స్నేహితుణ్ణి చూచివస్తానని చెప్పాడుగా!

అల్లుడు తిండిచూచి ఆమెగారు చాలా గాబరాపడ్డది.

"శరీరం పైత్యాన పడ్డట్టుంది. కాస్త నిమ్మకాయ ముక్కతోనైనా ఓ ముద్ద తినునాయనా" అన్నది. నిమ్మ

కాయముక్కతో అన్నం సహించలేదు శర్మకు ఆవిడ పుసిరి కాయ వేసింది. దాంతోనూ సహించలేదు.

"ఏం నాయినా బొత్తిగా అన్నంలోకి పలికి పోవటంలేదు ఎందుచేత?" అన్నది సుందరమ్మగారు. శర్మ జవాబు చెప్ప లేదు. కాని ఆవిడ మాటమాటికి అల్లాగ అడుగుతూ ఉంటే ప్రతిసారీ మాట్లాడకుండా ఊరుకోవటమూ బాగుండలేదు.

ఈ పరిస్థితులలో శర్మ చాలా తికమకలుపడి చివరకు ఊరికేనే, అనాలోచితంగా అనేశాడు. "వంట్లో ఏమీ కులాసాగా లేదండీ" అని. ముంఖం చిట్లించి ఎక్కడో చూస్తూ అన్నాడు ఈ మాటలు. ఇల్లాగ అనటం శర్మ అత్తగారు బాగా గమనించింది.

"ఏం, ఎందుకు బాగుండలేదూ?" అన్నాడు ముస లాయన కాస్త ఆదుర్దాపడుతూ.

శర్మ తనకేం జబ్బుఅని చెపుతాడు. మాట్లాడక ఊరు కొన్నాడు.

'రాత్రి ప్రయాణబడలిక వలన పైత్యం చేసినట్టుంది' అన్నాడు ఆయన, అల్లుడివిషయమై కాస్త ఆలోచించి.

"పైత్యమే కాదు లెండి, కాస్తపడిసెముకూడా పట్టి నట్లుంది. మాట కొంచెం బరువుగా ఉంది. కనపడటం లేదూ!" అన్నది ఆమెగారు.

శర్మ ఈ ఇద్దరి మాటలూవిని ఊరుకోటంతో వాళ్ళు, ఆ అబ్బాయికి ఒంట్లో ఏమీ కులాసాగా లేనిమాట నిజమే అనుకొన్నారు.

ఆయన అన్నాడప్పుడు, "ఏమే, అయితే అల్లుడుకి ఆ రేగటి పెరుగు వేస్తావా ఏమిటి? అసలే పైత్యంగా ఉంది కదా, అజీర్ణం చేసుకొస్తుందేమో!"

పంక్తిని కూచ్చున్న వాడికి వడ్డించకుండా ఎల్లా ఉంటుంది ఆవిడ. అందులో మీగడపెరుగు అల్లుడికి వేయకపోతే ప్రాణం పీకదూ ఆవిడకు? అందుకని "ఏం ఫరవాలేదు లెద్దురూ" అంటూ శర్మకు మీగడపెరుగు వేసింది ఆవిడ.

అప్పటికి శర్మ కడుపులో పడ్డ ఇడ్డెనలు కొంత వరకు అరుగుదలకు వచ్చినయ్యో, లేకపోతే ఈ మీగడ పెరుగులో జఠరాగ్ని పుట్టించే శక్తి ఏమైనా ఉందో చెప్పలేము కాని జరిగిన సంగతి ఏమిటా అంటే ఆ కుర్రవాడికి ఎక్కడలేని ఆకలి పుట్టుకొచ్చింది. ఇంకా కాస్త అన్నం పెట్టించుకొని ఆ పెరుగుతో తింటే బాగుంటుంది అని అనిపించింది అతనికి. కాని ఏమిలాభం? ఈ పెరుగు ఇల్లాంటిది అని ఆ అబ్బాయి ఇంతకు పూర్వమే ఊహించవలసినది! ఇందాకటినుంచి మెతుకులు కొరికి ఇప్పుడు తింటానికి తయారు కావటం పెద్దమనిషి తరహా కాదు. అందుకనే, పాపం, శర్మ విస్తట్లో ఉన్న ఆ రెండు మెతుకులే పెరుగుతో తినేశాడు.

ఇంకా కొంచెం అన్నం పెట్టించుకోమని అత్తగారు బ్రతిమిలాడింది. "ఏమీ ఫరవాలేదునాయినా, ప్రయాణం బడలిక వలన పైత్యించి అన్నం సయించటం లేదుగాని అంత కంటే మరేమీ లేదు. కాస్త పెరుగుతోనైనా రెండు ముద్దలు తినుబాబూ" అని ఆమెగారు ఎంత ప్రాధేయపడ్డా శర్మ, "అబ్బే, వద్దండీ ఏమీవద్దు. నాకు వంట్లో కులాసాగా

లేదు." అంటూ చెయ్యి అడ్డంపెట్టి, తాను అడ్డంపడి నానా హంగామా చేశాడు.

ఇంతకూ,

శర్మ తెలివితక్కువవాడు.

అదీకాక ఆ పరిస్థితులలో అల్లాగ అనటం తప్పని సరి అయింది.

శర్మ సంగతి ఇల్లాగ ఉన్నదా, అక్కడ సుందరమ్మ గారికి ఆందోళన ఎక్కువ అయింది. "పెరుగుతోనైనా కాస్త అన్నం తిన లేదమ్మా! వంట్లో పులకరం ఏదో తగిలిఉంటుంది!" అని ఆమె గోలపెట్టింది.

శకుంతల గదిలో మంచం వేసింది బావకు. అత్తగారు వద్దు అంటున్నా వినక శర్మ హాయిగా నిద్రపోయినాడు.

౨

అతడు మళ్ళీ మేల్కొనేసరికి బాగా మబ్బు పట్టి ఉన్నది. కొద్దిగా చలిగాలికూడా వీస్తున్నది.

అతడు నిద్రలేవటంతోనే మరదలువచ్చి అడిగింది 'బావా, ఎట్లాగుంది' అని. శర్మకు ఆశ్చర్యం కలిగింది.

అతనికేం జబ్బు నిజానికి!

పాపం అతనికి భాగా ఆకలి అవుతున్నది. ప్రొద్దున ఏమీ తినలేదాయెను. మామూలు రోజులలో అయితే అత్తగారు ఏమైనాచేసి పంపేదేగాని ఇప్పుడెట్లా పంపుతుంది! ప్రొద్దునేమో రెండు మెతుకులు కొటికి పోయినాడాయె. ఒంట్లో పులకరం తగిలిందేమో ఏమికర్మమో. ఫలహారం

కూడా పెళ్ళికే ఇంకా ఏమన్నా ఉందా, అని అనుకొంది ఆ మొగాయన.

అప్పటికి ఆరుగంటలు అయింది. అప్పుడు అతని ముఖం చూస్తేమాటుకు జ్వరం తగిలిన మనిషిలాగే ఉన్నాడు. ఆకలివల్ల ముఖం వడిలిపోయి ఉన్నది, మనిషి కూరాకు అయిపోయినాడు. అల్లుడిముఖం చూచేసరికి సుందరమ్మగారి గుండెలు కొట్టుకొన్నవి. అత్తగారింటికని ఆ అబ్బాయి రావటం ఏమిటి, ఈ వంట్లో కులాసాగా లేకపోవటం ఏమిటి, కర్మ కాకపోతే! అనుకొన్నది.

శర్మ శకుంతలను అడిగి కాసిని నీళ్ళు తెప్పించుకొని కాళ్ళూ చేతులూ ముఖం కడుక్కొని బట్టలు వేసుకొని ఎక్కడికో వెళ్ళటానికి సిద్ధమైనాడు. ఇదంతా చూచి, ఆ పిల్ల వాళ్ళ అమ్మతో చెప్పింది - 'బావ ఎక్కడికో వెళ్లాలని చూస్తు న్నాడే' అని. ఆవిడ ఆదరాబాదరా వచ్చి "ఎక్కడికి నాయనా ప్రయాణం?" అని అడిగింది.

"అల్లా వెళ్ళివస్తానండి" అన్నాడు శర్మ. అతను అసలు అనుకొన్నది ఏమిటీ అంటే, ఆ వెళ్ళటం వెళ్ళటం కాఫీహోటలుకెళ్ళి కాస్త ఏమైనా తిందామని.

శర్మ అత్తగారు ఈ మాటలువిని ఆదుర్దాగా అన్నది "ఎక్కడికి వెళ్ళుతావు నాయనా, వద్దు, వద్దు, వంట్లో కులాసాగా లేదన్నావా. ఈ ఈదురగాలిలో బైటకి వెళ్ళటం మంచిదికాదు. కాస్త కాఫీ యిస్తాను తాగి ఇంట్లోనే ఉండు" అంటూ బతిమిలాడింది.

ఇప్పుడెట్లా?

శర్మ గట్టిగా మాట్లాడే స్వభావం కలవాడు కాదు. అతనికి తగనిసిగ్గు, 'పనిఉందండీ, వెళ్ళివస్తాను' అని గట్టిగా చెప్పకూడదూ! చెప్పలేకపోయినాడు. అదే అతనికి వచ్చిన కర్మం. అందుకనే ఇన్ని తిప్పలు వచ్చినవి.

అదీకాక,

శర్మ భార్య ఒక్కసారి వచ్చి ఉన్నట్లయితే శర్మ తప్పకుండా ఆ అవకాశం చెప్పేవాడు తనకు ఆకలిగా ఉందనో ఏదో అల్లాగ. ఆపిల్ల రానేలేదు.

అప్పుడు తాస్త చినుకుకూడా ప్రారంభం అయింది. ఆ వర్షంలో వెళ్ళలేకనే ఊరుకున్నాడో, అత్తగారు కాఫీతో పాటు ఫలహారంకూడా పంపుతుందని భ్రమపడ్డాడో ఏమో కాని మొత్తంమీద శర్మ ఆగిపోయినాడు.

ఆతరువాత ఓ పావుగంటకు శకుంతల కాఫీ తెచ్చి ఇచ్చింది పుచ్చుకొన్నాడు. కాని ఆకలి తీరిందా ఏమన్నానా? కడుపులో మండిపోతున్నది.

శర్మ తెలివితక్కువవాడు అని ఇంకోసారి అనవలసి వస్తున్నది. తెలివితక్కువవాడు కాకపోతే ఆ శకుంతలనే పిల్చి నాకు ఆకలవుతున్నదే అని మాటమాత్రం ఎందుకు అనలేక పోయినాడు!

సిగ్గు! సిగ్గు! ఎందుకాసిగ్గు!

పోనీ ఎందుకన్నా కానీ, శర్మ అత్తగారు బైటకు పోవద్దూ అంటే పోకుండా ఉండిపోయినాడా. ఆమెగారు తన మాట వినే ఉండిపోయినాడని అనుకొంటే అదీ ఒక మర్యా

దగా ఉండేది. ఆమె అల్లాగ అనుకోలేదు. పాపం వెళ్ళే ఓపిక లేదమ్మా. వెళ్ళగలిగితే ఊరుకుంటాడుటమ్మా. అని ఆమెగారు ముసలమ్మతో అనటం శర్మ స్వయంగా విన్నాడు. ఇంతకూ అతను బైటికి వెళ్ళలేదు. ఆ కాస్త కాఫీ తాగి పడుకున్నాడు.

నీరసంగా ఉండటం మూలానా, ఏమీ తోచక పోవటం మూలాన, చలిగా ఉండటం మూలానా అతడు మళ్ళీ ముసుగు బిగించాడు. వెచ్చని ముసుగులో అతనికి చటుక్కున నిద్ర పట్టింది.

అతను నిద్రపోతూ ఉండంగా అత్తగారు రెండుమూడు సార్లు వచ్చి చూచి దిగులు ముఖంతో వెళ్ళిపోతూ వచ్చింది.

చివరకు శకుంతలను పిల్చి అన్నది, "అమ్మాయ్, బావ మూసిన కన్ను తెరవకుండా పడుకొన్నాడు. కాస్త ఒంటి మీద చెయ్యి వేసి చూడమ్మా ఎట్లా గుందో?"

శకుంతల గబాగబా వెళ్ళి చూచి వచ్చి, "అమ్మోయ్ బావకు బాగా జ్వరం వచ్చిందే. చెయ్యి కాలిపోతున్నది" అని చెప్పింది.

మనుగ్గా ఉన్న సమయంలో పడుకొని నిద్రపోతే ఒళ్ళు వేడిగా ఉండటంలో విపరీతం ఏమీ లేదు. కాని ఆపిల్ల కేం తెలుసు, జర్వం బాగా వచ్చిం దనుకొన్నది.

సుందరమ్మగారు ఇంతకుముందే అనుకొంటూ ఉన్న చాయె పిల్లవాడికి ఏమీ బాగుండ లేదని. అందుకని ఆ పిల్ల చెప్పినమాట నమ్మింది. అల్లుడు స్థితినిజూచి సుందరమ్మగారు

హడిలిపోయింది. ఆవిడ పూర్వకాలం మనిషి. సంసారం గుట్టు, రోగం రట్టు అనుకొన్నది.

అందుకనే ఆవిడ గబగబా రత్తమ్మగారి ఇంటికి వెళ్ళింది ఆ రోజు మధ్యాహ్నం.

సుందరమ్మను చూడటంతోనే రత్తమ్మ అన్నది 'ఏం వదినా' అల్లుడొచ్చాడటగా? చెప్పావుకావేం? ఉంటాడా నాలుగు రోజులు?

"ఉండడమ్మా మరి! అమ్మాయికూడా ఇక్కడే ఉందిగా" అన్నది సుందరమ్మ.

ఆమాటమీద రత్తమ్మ ముసిముసి నవ్వులు నవ్వు కొంటూ అన్నది "అయితే వదినా, మా కోడలును, పంపించు పూలజడ వేస్తాను."

సుందరమ్మ ముఖం చిట్లించి, "పూలజడ వేసినట్లే ఉంది! ఏ పాపిష్టివేళ బయలుదేరాడోగాని తల్లీ, వచ్చిన దగ్గరనుంచి మూసినకన్ను తెరవకుండా పడుకొన్నాడు." అన్నది విచారంగా.

రత్తమ్మ ముఖంలో సంతోషమంతా మాయమైనది. ఆమెకూడా ఆదుర్దాపడుతూ అడిగింది "ఏమమ్మా, ఎందుకు అల్లాగ పడుకొన్నాడూ? వంట్లో ఏమీ కులాసాగా లేదా ఏమిటి?"

ప్రొద్దున భోజనం చేసేప్పుడు వంట్లో ఏమీ కులాసాగా లేదండీ అన్నాడమ్మా. సరిగా భోజనం చెయ్యలేదు కూడాను. ఏదో ప్రయాణపు బడలిక కదా అనుకొన్నాను. మాట కొంచెం భారంగానేఉంది. కాని పులకరం తగిలిందని అనుకో

లేదు వదినా. అను కొంటే పెరుగు పోసేదాన్ని కాదు. అదే పొరబాటు అయిపోయింది. ఆపళంగా పోయి పడుకొన్నా డమ్మా ఇంతవరకు లేవలేదు"అన్నది, సుందరమ్మ.

"పెరుగెందుకు పోశావమ్మా. నీకేమన్నా మతి పోయిందా ఏంకర్మం?"అని కోప్పడ్డది రత్తమ్మగారు.

"ఎంత వదినా, కాస్త వేశానమ్మా. అవతల మీ అన్న య్యకు వడ్డిస్తూ ఆ అబ్బాయికి వేయకుండా ఎల్లాగ ఊరుకొనే దమ్మా! బాగుంటుందా నీవే చెప్పు? బాగుండటం ఎట్లాగున్నా నా ప్రాణం ఒప్పలేదు వదినా, చెప్పొద్దూ ఉన్నాం[illegible]గతి!" అంటూ సుందరమ్మ కాస్త విచారపడ్డది.

రత్తమ్మ బుగ్గలు నొక్కుకుని, "మంచిపని చేశావులే" అని "నిద్రకూడా పోయినాడా?"అని అడిగింది అనుమానిస్తూనే.

సుందరమ్మ "ఆఁ" అని తలఊపింది.

"నిద్రకూడా పోనిచ్చావూ? ఇంకేమమ్మా, జ్వరం రాకేం జేస్తుంది?" అని తప్పు అంతా సుందరమ్మదే అయినట్లు తేల్చింది రత్తమ్మగారు.

సుందరమ్మ కూడా తాను చేసింది ఏమంత మంచిపని కాదని ఇదివరకే అనుకొంటున్నది. అందుకని విచారంతో అన్నది. "ఏం జేసేదమ్మా వదినా 'అప్పటికీ' నిద్రపోవద్దు నాయినా, అని చెప్పాను."

రత్తమ్మ కొంచెం ఆలోచించి ఇల్లా అన్నది "పిల్లను పంపకపోయినావా? దగ్గర కూర్చుని ఏదో మాటాపలుకూ ఆడుతూ ఉండేదిగా?"

సుందరమ్మ కొంచెము రహస్యంగా చెప్పింది "నే నే పిల్లను దగ్గరకు పోవద్దన్నాను వదినా చెప్పొద్దూ. నాకు భయం వేసింది. చిన్నపిల్లలా! అతనికి కులాసాగా లేకపోయె! ఏమంటావ్?"

రత్తమ్మగారు ఆమాటనిజమేలే అని ఒప్పుకొన్నది.

కాసేపు ఇద్దరూ మాట్లాడకుండా ఊరుకొన్నారు, ఏదో ఆలోచిస్తూ.

చివరకు సుందరమ్మగారే అడిగింది, "ఇప్పు డెట్లాగు వదినా, అతనేమో అట్లాగుండె! మీ అన్నయ్య ఆఫీసునుంచి పేటకు వెడతానన్నారు. రాత్రికి ఏ పదింటికి వచ్చినా వచ్చినట్లే! డాక్టరుకు కబురుచేద్దామా?"

రత్తమ్మ బాగా ఆలోచించి ఇల్లాగ ధైర్యం చెప్పింది. "ఎందు కమ్మా డాక్టరు ఈ మాత్రానికి! పార్వతమ్మ అక్కయ్యనుకూడా పిలుచుకొని వస్తానుండు. ఆవిడకు చేతి నాణెంకూడా తెలును. ఏదో చెబుతుంది-నీవు ఊరికే ఆదుర్దా పడకు."

"దబ్బున రా వదినా, నాకేమీ తోచటంలేదు." అని సుందరమ్మ మరీమరీ చెప్పి వచ్చేసింది.

3

అప్పటికి బాగా చీకటి పడ్డది. శర్మ నిద్ర మేల్కొనే సరికి గది అంతా చీకటిగా ఉంది.

"శకుంతలా!" అని పిలిచాడు శర్మ.

'ఆఁ వస్తున్నా బావా' అని జవాబు చెప్పి ఆ తరువాత మరో నిమిషానికి లాంతరు వెలిగించుకొని, "కాస్త కులాసాగా ఉందా? బావా!" అని చాలా ఆదుర్దాగా అడిగింది, ఆ పిల్ల.

"నాకు కులాసాగా లేకేమే! అట్లా అడుగుతా వెందుకే శకుంతలా," అన్నాడు శర్మ నవ్వుతూ.

ఆపిల్ల ఏమీ జవాబు చెప్పకుండా చాలా తొందరగా వెళ్ళిపోవటానికి ప్రయత్నం చేసింది.

శర్మ అప్పుడొక తమాషాచేశాడు. చటుక్కున ఆపిల్ల చెయ్యిపట్టుకొని ఆపాడు!

అమ్మయ్య, శర్మకు కాస్త ధైర్యం వచ్చింది. అతడు ఆమాత్రం ధైర్యం చేస్తాడని ఎవ్వరూ అనుకో లేదు.

అల్లాగ ఆపిల్లను ఆపి "ఏమిటా తొందర! ఎక్కడికి పోవాలె?" అని అడిగాడు.

ఆ ఆమ్మాయి పెనుగులాడుతూ, "వదులు బావా అక్కయ్యకు చెప్పివస్తాను" అన్నది.

"ఏమనిచెబుతావే?" అని అడిగాడు శర్మ ఆశ్చర్య పోతూ.

"నీవు కాస్త కులాసాగా వున్నావనీ.....లేచి మంచం మీదే కూర్చున్నావనీ.....ఒళ్ళుమటుకు.....ఇంకా బాగా వెచ్చగా....ఉందనీ" అని వేళ్ళమీద లెక్కపెడుతూ దీర్ఘాలు తీసింది శకుంతల.

"ఇప్పుడు చెప్పకపోతేనేం?"

"అమ్మో! అది దిగులుపడి కూర్చున్నది."

"అంత దిగులుపడ్డ మనిషి వచ్చి నన్ను చూడలేదేం?"

"ఏమో బావా!" అని ఒక్క వూపుతో విదిలించుకు పోయింది ఆపిల్ల!

ఇంకా చలిగాలి వీస్తున్నది. బలహీనంగా ఉండటం మూలాన శర్మకు వణుకు వచ్చింది.

అప్పుడు శర్మ ఏమిచేశాడూ అంటే, శాలువ కప్పుకొని తలగుడ్డ చుట్టుకొని మంచంమీదనే కూర్చొని గోడకు జేరగిలపడి కూర్చుని పుస్తకం ఒకటి తెరిచి చూడటం మొదలుపెట్టాడు. ఆ ఆకారం చూచినవాళ్ళు అతనికి చాలా జబ్బుగా ఉందని అనుకోక తప్పదు.

శర్మ పుస్తకం చూస్తున్నాడన్నమాటేగాని అతనిని ఎక్కువగా బాధిస్తున్న సమస్యకు సమాధానం ఆపుస్తకంలో ఎక్కడా కనుపించలేదు. భార్యవచ్చి తనను ఎందుకు పలకరించలేదూ అని ప్రశ్న!

అసలు తాను వచ్చిందెందుకూ?

ఇన్నాళ్ళకు తాను వచ్చాడుగదా, వచ్చి రావటంతోనే ఆమె కనపడి పలకరించవద్దూ! పోనీ, తాను వచ్చి రావటంతోనే కనపడకపోతేమానె' కాసేపు అయిన తరువాత అయినా రాకూడదూ!

సాయంత్రం తాను అత్తగారిమాటవిని ఇంట్లో ఉండి పోయింది ఎందుకూ? అప్పుడైనా ఆవిడగారు వచ్చి పలకరిస్తుందని ఆశతోనేగా! ప్రొద్దుటనుంచి ఇంతవరకు ఒక్కసారి వచ్చి చూచిపోవటానికి వీలులేకపోయిందా ఆ మహారాణి గారికి.

ఇవీ శర్మను బాధిస్తున్న ప్రశ్నలు.

ఎంతసేపు ఆలోచించినా అతనికి సరియైన సమాధానాలు తోచలేదు. ఇదివరలో తాను మహా ప్రేమగల దానిలాగు ప్రవర్తించింది. నిజానికి ఆ అమ్మాయి చాలా టక్కరి మనిషిలాగా కనపడుతున్నది. ఛీ! ఒకవేళ కనపడ్డా ఆవిడను మాట్లాడించనేకూడదు. అనిగట్టిగా నిశ్చయించుకున్నాడు శర్మ.

శర్మ చాలా ఘోరమైన ప్రతిజ్ఞ చేశాడు. అది నిలబెట్టుకోనేవాడే కాని అతనికి అప్పుడు ఇంకొక్క విషయం జ్ఞాపకం వచ్చింది

ఆ అమ్మాయి తాను రాకపోయినా శకుంతలను పంపిందిగా, తను కులాసాగా ఉన్నదీ లేనిదీ చూచిరమ్మని.

తనపై ప్రేమ లేకపోతే ఎందుకు అల్లాగ ఆదుర్దా పడుతుంది ఆ అమ్మాయి; అటునుంచి ఆ ప్రశ్నలకూ, ఇటు ఈ ప్రశ్నలకూ శర్మ తట్టుకోలేక పోయినాడు.

శర్మ ఏమైనా ఆరితేరినవాడా ఏమన్నానా? ఇరవై ఏండ్ల కుఱ్ఱవాడు!

సరేకానీ...రాత్రి భోజనానంతరైన తరువాత కనపడక పోతుందా, అప్పుడు ముఖాముఖినే తేల్చుకుందాము ఈవిషయాలన్నీ, అని అనుకున్నాడు.

౪

శర్మ ఇల్లాగ ఆలోచిస్తున్నాడు. ఈలోపున అవతల గదిలో పార్వతమ్మగారూ రత్తమ్మగారూ ఇంకో ముసలమ్మా, చేరి శర్మకు ఆపూటకు ఏమిమందు పడాలో అని తీవ్రంగా ఆలోచిస్తున్నారు.

'దాన్ని అటుకేసి వెళ్ళవద్దని చెప్తూ దానితరువాత నేమనుకొంటే ఏమిలాభం?' అని ఎవరో అన్నమాటలు శర్మకు వినిపించినవి. ఎవరిని ఉద్దేశించి ఈమాటలు అన్నారో శర్మగ్రహించాడు. మనస్సులో పాపం చాలా కష్టపడ్డాడు.

ఇంతలో ఆడవాళ్ళంతా శర్మ ఉన్న గదిలోకి వచ్చారు.

'ఏం, నాయనా ఎట్లాగుంది?' అని అడిగింది-పార్వతమ్మగారు ఎవరినో రోగిని అడిగినట్లు.

"కులాసాగానే ఉందండి" అన్నాడు శర్మ.

"అన్నం తింటావా?" అని అడిగింది ముసలమ్మగారు.

కడుపులో ఆకలి అవుతూనే ఉండె! తింటా నన్నాడు శర్మ.

"ఇంకేమమ్మా, ఆ అబ్బాయికి కాస్త తేలికగా ఉన్నప్పుడు పస్తుపడుకోబెట్టటం ఎందుకమ్మా."అన్నది పార్వతమ్మ.

శర్మ సంతోషించాడు.

"అయ్యో, అల్లాంటి తెలివితక్కువపని ఏమీ చేయకండత్తా. ఈ పూట పస్తుపడుకో పెట్టటమే మంచిది." అన్నది ముసలమ్మగారు.

శర్మకు అప్పుడు తెలిసింది వ్యవహారం చాలాదాకా పోయినట్లుందని.

నిజానికి శర్మ లేచి, "నాకేమీ జబ్బులేదు. అన్నం సయించక పోవటానికి కారణం వేరే ఉన్నది. నన్ను చంపక అన్నం పెట్టండి" అని పెద్దగా అనేస్తే సరిపోయేది!

శర్మకు ఆమాత్రం ధైర్యం ఉంటే ఇంకా అనుకో వలసింది ఏముంది ! సిగ్గుతో తలవంచుకొని నంగిగా అన్నాడు, 'ఫరవాలేదు లెండి, కులాసాగానే ఉంది' అని.

గట్టిగా చెప్పలేదని శర్మను నిందించటంకూడా న్యాయమని నాకు తోచటంలేదు. నిజానికి ఏముఖం పెట్టుకొని తన కేమీ జబ్బులేదని గట్టిగా అనగలడు !

ప్రొద్దున పదిగంటలకు తనకు వంట్లో ఏమాత్రం సుఖంగా లేకపోయె !

అన్నం సయించలేదాయె !

ప్రొద్దస్తమానమూ మూసినకన్ను తెరవకుండా పడుండె !

ఇప్పుడు నాకేమీ జబ్బులేదు కులాసాగా ఉన్నానని గట్టిగా ఎట్లా అనగలడు.

అంటేమటుకు ఎవరు నమ్ముతారు !

పోనీ నంగుతూనో, నసుగుతూనో, శర్మ అన్నాడుగా అన్నం తింటానని ! సుందరమ్మగారు అయినా ఆ సంగతి గ్రహించి మెదలకుండా ఊరుకొని అతనిని భోజనానికి లెమ్మన కూడదూ !

ఆమె గారు అందరినీ అడుగుతున్నది, అల్లుడికి అన్నం పెట్టాలా వద్దా అని !

అయితే;

ఆమెది తప్పు అంటానికే వీలులేకుండా ఉంది ఎందుకూ అంటే;

ఇంటాయన ఊళ్ళో లేడాయె !

డాక్టరు వచ్చి చూడ లేదాయె!

అనుభవం గలవాళ్ళు అంతా పిల్లవాడికి అన్నం పెట్ట వద్దని చెపుతూ ఉండిరి! ఆవిడ మటుకు ఏం జేస్తుంది!

అన్నం పెట్టకూడదన్న తీర్మానం గొడవ లేకుండా జరిగితే కాస్త బాగుండేది! ఆ విషయమై చచ్చేటంతటి గొడవజరిగింది. ఆ విషయమై అక్కడున్నవాళ్లు అందరూ అన్నివిధాలా చెప్పారు!

ఆ రాత్రికి కాస్త మిరియాల కషాయం ఇచ్చి పడుకో బెట్టమని ఒకరు అన్నారు.

కాస్త, చారు అన్నం పెట్టమని ఇంకొక రన్నారు.

చివరకు ముసలమ్మగారు తెగేసి చెప్పేసింది అన్నం గిన్నం ఏమీ పెట్టవద్దనీ, పెడితే చాలా ప్రమాదం అనీ, దానితరువాత ఏమి అనుకొన్నా ఏమీ లాభంలేదు అనీ!

ఎట్లాగయితేనేం ఆపూటకు శర్మను పస్తుపడుకో బెట్టాలనే నిశ్చయించారు వాళ్ళంతా కలిసి.

ఆపూటకు కాళ్ళు ముడుచుకొని పొట్టలో పెట్టుకొని పడుకొందామని శర్మకూడా అనుకొన్నాడు.

ఇంతలో పార్వతమ్మ, ఆవిడ పుణ్యామా అంటూ ఒక మాట అన్నది. ఆమాట అనబట్టే శర్మ బ్రతికిపోయినాడు.

"కుఱ్ఱవాణ్ణి బొత్తిగా పస్తుపడుకోబెట్టకండి మంచి వేడి పాలల్లో, కాస్త పటిక పంచదారవేసి ఇయ్యండి. భారం తీసేస్తుంది" అన్నది ఆవిడ. ఆ పాలు అయినా వేగిరం ఇస్తే బాగుండునని శర్మ తహాతహాలాడి పోయినాడు.

ఇంతలో రత్తమ్మగారు వచ్చి ఏది నాయినా పడుకో అన్నది, రెండు వేళ్ళూ ఎత్తిపట్టుకొని.

'నాకు ఏమీ వద్దండీ, కులాసాగానే ఉన్నానండీ', అన్నాడు శర్మ. ఆ అనటం దృఢంగా అనలేదాయె! ఏదో సిగ్గు పడుతూ అన్నాడు.

"చూడు నాయినా ఎందుకైనా మంచిది, భారంగా ఉన్నదా, అంతా తగ్గుతుంది. మా నాయనకదూ ఎంతసేపు మంటపెట్టదు. కాస్త చిమచిమ లాడుతుంది అంతే." ఇల్లాగ చిన్నపిల్లవాణ్ణి బ్రతిమిలాడినట్లు బ్రతిమిలాడింది ఆమెగారు.

శర్మకు గట్టిగా మాట్లాడేందుకు నోరు లేదుగా! చూస్తుండగానే ఆమె రెండు కళ్ళల్లో చుట్టుమనిపించి వెళ్ళిపోయింది.

౫

శర్మా! శర్మా!

శర్మను చూస్తే ఎవరికైనా జాలివేస్తుంది! పాపం బిడ్డ గంటసేపు బాధపడ్డాడు. ఆమంటతో.

శకుంతల మాత్రం దగ్గర కూర్చుని 'కళ్ళు తెరు బావా తెరిస్తే మంట పోతుంది' అని చెపుతూ వచ్చింది.

కళ్ళు తెలిపిడిపడ్డ తరువాత శర్మ వేడిపాలు తాగి పడుకున్నాడు. ఆకలితీరక వెంటనే నిద్రపట్టలేదు! మేల్కొనే ఉన్నాడు.

శర్మ చాలా చికాకు పడిపోయినాడు. తనకేమి చేసిందని పస్తు పడుకోబెడుతున్నారు వీళ్ళు!! ప్రొద్దున్న

ఒంట్లో కులాసాగా లేదండీ అని అనటం మూలాన ఇన్ని సంఘటనలు బయలుదేరాలా ?

తన భార్య వచ్చి, ఒక్కసారి కలుసుకొన్నట్లయితే నిజం సంగతి చెప్పేశేవాడు. ఏ ఇబ్బందీ లేకపోయేది! ఆ అమ్మాయి రాకపోవటమే తనస్థితికి అంతా కారణం!

ఇల్లా అనుకొని శర్మ భార్యమీద చాల కోపం తెచ్చుకున్నాడు. కాని ఆ పిల్ల వచ్చి కళ్ళకు కనపడితే గద నాలుగు చీవాట్లు వేయటానికి!

అసలు ఆమె ఇంతవరకు రాలేదు. రావద్దని కూడా గట్టిగా చెప్పారు వాళ్ళు. ఆ సంగతికూడా జ్ఞాపకం వచ్చింది.

అప్పటికి అంతా పడుకున్నారు. శకుంతలకూడా నిద్ర పోయింది. తన భార్య అంతమూర్ఖంగా రాకుండా ఉంటుందా అని శర్మకు అనుమానం కలిగింది, ఇంతలో ఎవరో వస్తున్నట్లు అలికిడి అయింది ఆ అమ్మాయే వస్తున్నట్లు తెలిసింది.

అల్లా అని తెలిసినప్పుడు నవ్వుతూ ఆ అమ్మాయిని పలకరిస్తే, తనకేమీ జబ్బు లేదని ఆపిల్ల అనుకొంటానికి వీలు అయ్యేది. మళ్ళీ శర్మ ఇక్కడ ఇంకొక తెలివితక్కువపని చేశాడు.

ఆపిల్ల వస్తున్నదని తెలియటంతోనే చటుక్కున అటు తిరిగి పడుకొని ముసుగు బిగించాడు. అతనికి భార్యమీద కోపంగాఉంది. అందుకని అల్లాగచేశాడు. ముసుగుపెట్టుకొని పడుకొన్నవాణ్ణి చూచి ఆపిల్ల ఏమనుకుంటుంది.

శర్మ ప్రణయకోపం పట్టాడన్నమాట! శాస్త్రం చదువుకొన్న శర్మ ఇంత పిచ్చివాడు అయినాడేమి!

ప్రణయకోపం పట్టవలసింది ఆడవాళ్ళుగాని మొగ వాళ్ళు కాదు కదా! శర్మ చదువుకొన్న చదువంతా ఎందుకూ అక్కరకురాలేదు.

ఆ అమ్మాయి దగ్గరకువచ్చి మీద చెయివేసి లేపితే శర్మ లేవలేదు. తాను కోపం నటిస్తున్నాననుకొంటున్నాడే కాని ఆపిల్ల మరీ హడలిపోతున్నదని ఊహించలేదు.

చివరకు ఎట్లాగయితేనేమి ఎంతో కష్టంమీద కళ్ళు తెరచి చూశాడు.

"ఏమండీ, ఎట్లాగుంది వంట్లో? బాగా జ్వరం వచ్చిందా! కాస్త జారినట్లుందే?" అన్నది ఆ అమ్మాయి ఎంతో ఆదుర్దాగా!

అప్పుడు శర్మకు నిజంగా మంచి ఆలోచన ఒకటి వచ్చింది.

ఆ అమ్మాయితో నిజం చెప్పేద్దామను కొన్నాడు.

అల్లాగ చెబితే, ఆ అమ్మాయి జాలిపడి అరిసెముక్కో, ఏదో అలాంటిది ఏదైనా తింటానికి పెడుతుందని ఒక ఆశ. లేకపోతే అందరూ నిద్రపోయినారు కాబట్టి, తనను తీసికెళ్ళి పెరుగుపోసి అన్నం పెట్టినా పెట్టవచ్చునని ఇంకో ఆశ.

ఇల్లాగ ఆశపడ్డవాడు జరిగినసంగతి అంతా పూస గుచ్చినట్టు చెబితే సరిపోయేది.

అల్లాగ చెబితే అసహ్యంగా ఉంటుందనుకొన్నాడో, సిగ్గు పడ్డాడో ఏమో? చెప్పక "నాకు చాలా ఆకలిగా ఉండదని మాత్రం గునుపుగా అన్నాడు.

అతను అల్లాగ చెబుతూ ఉంటే ఆ పిల్ల నమ్మదు. అదేం కర్మమో!

'అల్లాగే ఉంటుంది లెండి, దొంగ ఆకలి అది!' అన్నది పైగా.

శర్మ ఈమాటవిని చికాకుతో అన్నాడు. 'నాకు వంట్లో కులాసాగానే ఉందే' అని

ఆ పిల్ల అతనిమాటకు అడ్డొచ్చి 'కలికం పడ్డదిగా, అందుకనే కాస్తకులాసా ఇచ్చింది. ఈపూట ఏమీ తినకుండా పడుకుంటిరా, రేపటికి బాగా తేలిక ఇస్తుంది' అన్నది.

వ్యవహారం ఎదురు తిరుగుతున్నది. అతడు తికమకలై 'నాకు ఆకలేస్తున్నది' అని పెద్దగా అన్నాడు.

జబ్బులో అన్నంపెట్టమని మంకుపట్టు పట్టిన కుఱ్ఱవాణ్ణి చూచి, తల్లి ఎల్లాగ జాలిపడుతుందో అల్లాగ జాలిపడ్డది ఆ అమ్మాయి.

ఆ పిల్ల అతణ్ణిచూచి, బుజ్జగిస్తూ ఇల్లాగ అన్నది. 'ఇప్పుడు ఆకలేమిటండీ, పొద్దుగూకులూ మూసినకన్ను తెరవకపోతిరి, కాస్త జ్వరం జారింది కాబట్టి అల్లాగే అనిపిస్తుంది. పొద్దున ఒక్కముద్ద అయినా తినగలిగారూ!

తనకు జ్వరమా?

ఈమాటమీద శర్మ కొద్దిగా నవ్వుకొన్నాడు. ఆ తరువాత కోపంకూడావచ్చింది. అయినా శాంతంగానే అన్నాడు. ప్రొద్దున అన్నం తినకపోవటానికి వేరేకారణం ఉంది' అని.

ఆపిల్ల తల గిరగిరా త్రిప్పి 'నేను నమ్మనులే! నీ మాటలు' అన్నట్లు చూచింది.

శర్మ భార్య చెయ్యి పట్టుకొని లాగి మంచంమీద కూర్చోబెట్టుకొని నవ్వుతూ నిజం చెప్పేద్దామన్న ఆదుర్దాతో అన్నాడు 'సూడూ! అసలు సంగతి ఏమిటీ అంటే, వంట్లో బాగుండ లేదని అన్న మాట అబద్ధము.'

ఈ మాటలు అంటూ శర్మ, ఆ అమ్మాయికి తన యందు జాలి కలగాలనికామాలు ఆ పిల్ల చిన్న గడ్డాన్ని ముద్దుగా తట్టి బుగ్గలు తాకాడు.

ఆ అమ్మాయికి జాలి కలుగలేదు సరిగదా ఎందుకో కొద్దిగా కోపంకూడా వచ్చింది. మంచంమీద కూర్చున్నదల్లా చటక్కున లేచి నుంచుని "ఓహోహో జబ్బుగా ఉన్నమాట పగలంతా నిజమున్నా ప్రొద్దు గూకటంతోనే అబద్ధమూ అయిందేం? చాల్లెండి. ఊరుకోండి. ఆ, మీ వేషాలు నా దగ్గర సాగవు" అని విరగబడి నవ్వి విదిలించుకొని గదితలుపు విసురుగా వేసి వెళ్ళిపోయింది. శర్మ తెల్లబోయి ఊరు కొన్నాడు.

* * * *

శర్మ సంగతి ఏమైంది. మరునాడు ప్రొద్దున అయినా అతనికి అన్నం పెట్టారా, అత్తగారింట్లో ఆ తరువాత ఎన్ని రోజులు ఉన్నాడు? అని ఇల్లాగ బోలెడు సందేహాలు మనకు కలుగతవి.

ఏమో, ఆ విషయం నాకు అంతగా పట్ట లేదు.

కాని;

శర్మవంటి తెలివితక్కువవాళ్ళు ఈ ప్రపంచంలో ఎట్లా బ్రతుకుతారా అనిమాత్రం విచారిస్తున్నాను.